క్లుప్తంగా

చిలకపాలెంలో ఏటీఎం సేవలు ప్రారంభం


ఏటీఎం సేవలను ప్రారంభిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం కూడలిలో హిటాచీ ఏటీఎం సేవలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా హిటాచీ ఏపీ మాస్టర్ ఫ్రాంచైజీ ప్రతినిధి మాట్లాడుతూ 24 గంటలూ ఏటీఎం సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అన్ని బ్యాంకుల కార్డుదారులు, స్థానికులు, ప్రయాణికులు ఏటీఎం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బాలి శ్రీనివాసనాయుడు, నాలి రవికుమార్, పిసిని రాంబాబు, పందిరి శ్రీనివాసరావు, లక్ష్మణరావు, వండాన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో సినీనటుడు కిరణ్ అబ్బవరం


కిరణ్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఆలయ సిబ్బంది

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని వర్ధమాన సినీ హీరో కిరణ్ అబ్బవరం బుధవారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ఆరోగ్య ప్రదాతను దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. 'వినరో భాగ్యము విష్ణు కథ' అనే సినిమా త్వరలో విడుదల కానున్న నేపథ్యంలో ప్రమోషన్ వర్క్‌లో భాగంగా జిల్లాకు వచ్చినట్లు తెలిపారు. తన ముందు సినిమాల కంటే ఈ చిత్రం అద్భుతంగా వచ్చిందని, ప్రేక్షకులు ఆదరించి దిగ్విజయం చేయాలని ఆదిత్యునికి మొక్కుకున్నట్లు చెప్పారు. అనంతరం కిరణ్‌కు ఆలయ సిబ్బంది బీఎస్ చక్రవర్తి జ్ఞాపిక అందజేశారు.

నేడు సెక్యూరిటీగార్డు ఉద్యోగాలకు ఎంపికలు


వివరాలు వెల్లడిస్తున్న సురేష్‌కుమార్

లావేరు: లావేరులోని మండల పరిషత్ కార్యాలయం వద్ద సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలకు బుధవారం ఎంపికలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.సురేష్‌కుమార్ తెలిపారు. తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఎస్ఐఎస్ సెక్యూరిటీ సంస్థ ద్వారా పదో తరగతి పాసైన వారికి సెక్యూరిటీ గార్డులుగా ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు, 167.5 సెంటీమీటర్ల ఎత్తు, 56 నుంచి 90 కిలోల బరువు కలిగిన వారు అర్హులన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించిన వేతన చట్టం ఆధారంగా జీతాలు ఇస్తారన్నారు. ఎంపికలకు హాజరయ్యే అభ్యర్థులు టెన్త్ ఉత్తీర్ణత సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలు తీసుకురావాలన్నారు. సూపరింటెండెంట్ సునీత ఉన్నారు.

ఫుడ్ కార్పొరేషన్ కమిటీ సభ్యునిగా శ్రీనివాసనాయుడు



రణస్థలం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారత ఆహార సంస్థ కన్సల్టేటివ్ కమిటీ సభ్యునిగా రణస్థలం మండల పాతర్లపల్లి గ్రామానికి చెందిన గొర్లె శ్రీనివాసనాయుడు మరోసారి నామినేట్ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఈ పదవిలో రెండేళ్లు కొనసాగుతానన్నారు. బలహీన వర్గాలకు చెందిన తనకు రెండోసారి ఈ పదవి ఇప్పించిన రాజ్యసభ సభ్యులు జీ.వి.ఎల్ నరసింహారావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. రైతన్నలకు గిట్టుబాటు ధరలు వచ్చేటట్లు కృషి చేస్తానని చెప్పారు.

విద్యార్థులకు ధ్యానంపై శిక్షణ


ధ్యానం చేస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని రామలక్ష్మణ కూడలి సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు స్కూల్‌లో విద్యార్థులకు ధ్యానంపై బుధవారం శిక్షణ ఇచ్చారు. పిరమిడ్ స్పిరుట్యువల్ సొసైటీ మూమెంట్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ మైలపల్లి సూరిబాబు, ప్రిన్సిపాల్ తెన్నేటి నరసింహారావు, శిక్షకులు బాలాజీ, బిందుమాధవి, పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి పూజలు

ఎచ్చెర్ల: కింతలిమిల్లు జంక్షన్‌లోని కనకమహాలక్ష్మి అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పసుపుకుంకుమలతో అర్చనలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు.

దుష్ప్రచారాలను తిప్పికొట్టండి

- ఎమ్మెల్యే కిరణ్‌కుమార్


ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న సోషల్ మీడియా కన్వీనర్లు

రణస్థలం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై టీడీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా తిప్పికొట్టాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్లకు సూచించారు. రణస్థలం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఇటీవల వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఎంపికైన ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం సోషల్‌మీడియా మండల కన్వీనర్లు, కో కన్వీనర్లు ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌ను బుధవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామాల్లోని అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలన్నారు. టీడీపీ, జనసేనతో పాటు ఇతర పార్టీల నాయకులు ముఖ్యమంత్రిపై చేస్తున్న అసత్య ఆరోపణలను సోషల్ మీడియా వేదికగా.. పక్కా ఆధారాలతో తిప్పికొట్టడంతోపాటు ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలన్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 151 స్థానాలు గెలుపొందడానికి సోషల్ మీడియా సైనికులు కృషి ఎంతో ఉందన్నారు. అదే ఉత్సాహంతో రానున్న ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడేతత్వం ఉన్న ప్రతి కార్యకర్తకు సకాలంలో సముచిత స్థానం దక్కుతోందన్నారు. రెండు లక్షల కోట్ల రూపాయలను వివిధ సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు నేరుగా వారీ ఖాతాల్లోనే ఒక్క రూపాయి కూడా ఎవరికీ లంచం ఇవ్వకుండా పారదర్శకంగా చెల్లించిన విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. గ్రామ నాయకుల్ని సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో లావేరు, రణస్థలం, ఎచ్చెర్ల మండలాల సోషల్ మీడియా కన్వీనర్లు రెడ్డి రమణ, గవిరెడ్డి రవికుమార్, గొర్లె సురేష్, కో-కన్వీనర్లు సుంకర రాహుల్, మీసాల జగన్, నాయన లక్ష్మణ రెడ్డి, నేదురు భాను, బర్రి లక్ష్మణరావు, దుంప ఈశ్వరరావు, నక్క ఉమామహేశ్వరరావు, ఆకుల వరప్రసాద్, కీర్తి రవికుమార్, కోలా హరీష్, మైలపల్లి చిన్న ఉన్నారు.

కర్బూజా సాగుపై రైతన్న ఆసక్తి


లావేరులో సాగుచేస్తున్న కర్బూజాపంట

లావేరు: రైతులు కర్బూజా పంట సాగుపై ఆసక్తి కనబర్చుతున్నారు. లావేరు, గోవిందపురం, ఇజ్జాడపాలెం, లింగాలవలస, పోతయ్యవలస, కేశవరాయునిపురం, ఇజ్జుపేట, లక్ష్మీనారాయణపురం, అప్పాపురం గ్రామాల రైతులు అధిక విస్తీర్ణంలో ఈ పంటను వేశారు. కిందటి సంవత్సరం వరకూ పోతయ్యవలస గ్రామ రైతులు మాత్రమే కర్బూజాను సాగు చేసేవారు. ఈ పంట లాభదాయకంగా ఉండటంతో వారి చూసి మిగతా గ్రామాలు కూడా ఈ ఏడాది నుంచి సాగు చేసేందుకు ఆసక్తి చూపారు. వ్యాపారులే తమవద్దకు వచ్చి వద్దకే పండ్లను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నట్టు రైతులు తెలిపారు.

జాబ్‌కార్డు ఉన్న వారందరికీ ఉపాధి


మాట్లాడుతున్న ఏపీడీ రాధ

ఎల్.ఎన్.పేట: జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతీ కుటుంబానికి ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని ఆ పథకం హిరమండలం క్లస్టర్ ఏపీడీ పంచాది రాధ అన్నారు. మండల కేంద్రంలోని ఉపాధి హామీ పథకం కార్యాలయంలో బుధవారం సిబ్బందితో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పంచాయతీల వారీగా జరుగుతున్న పనులు వివరాలు, పనిలోకి వస్తున్న వేతనదారుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. మరింత ఎక్కువ మంది పనిలోకి వచ్చేలా చేయాలన్నారు. కొలతల ప్రకారం ఉదయం, సాయంత్రం రోజుకు 6 గంటలకు తక్కువ లేకుండా వేతనదారులతో పనులు చేయించే బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందన్నారు. ప్రతీ వేతనదారునికి రోజుకు రూ.250 వేతనం గిట్టుబాటు అయ్యేలా పని చేయించాలన్నారు. నిర్లక్ష్యంగా పని చేసే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధి పథకం ఏపీఓ వి.శ్రీదేవి పాల్గొన్నారు.

లక్ష్యాన్ని అధిగమించాలి

హిరమండలం: లక్ష్యాన్ని అధిగమించి ఉపాధి పనులు చేయించాలని ఏపీడీ పి.రాధ అన్నారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామల్లోనూ ఉపాధి పనులు జరిగేలా చూడాలన్నారు. ఉపాధి వేతనదారులను పెంచాలన్నారు. ప్రతీ వేతనదారునికి రూ.250 గిట్టుబాటు అయ్యేలా పనులు జరిపించాలన్నారు. కొలతల ప్రకారం పనులు చేసేలా చూడాలన్నారు. ఏపీఓ శ్రీనివాసరావు ఈసీ సంతోష్, టెక్నికల్ అసిస్టెంట్‌లు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ


ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న వెంకటరెడ్డి

నరసన్నపేట: విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, ఈ దశలో విద్యార్థుల్లో అభ్యసన మెరుగుపరచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని లిప్ (లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం) స్టేట్ టీమ్ సభ్యుడు వెంకటరెడ్డి అన్నారు. బుధవారం నరసన్నపేట మండలంలోని ఉర్లాం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బోధనతో పాటు విద్యార్థులతో ప్రాక్టికల్స్ చేయించాలన్నారు. అప్పుడే విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. సబ్జెక్టు బోధనలో ఎప్పటికప్పుడు మార్పులు చేసుకోవాలన్నారు. ప్రధానంగా విద్యార్థులకు తప్పులు లేకుండా చదవడం, రాయడం విధిగా రావాలన్నారు. గణితంలో ఫండమెంటల్స్ నేర్పాలని సూచించారు. ఉర్లాంలో ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల అభ్యసన తీరు బాగుందన్నారు. డైట్ అధ్యాపకులు వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉత్తమ బోధన

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ శాంతి హేమ్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాధాన్యతను తెలియజేస్తూ బుధవారం పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ, మానవహారం చేపట్టారు. శాంతి హేమ్ మాట్లాడుతూ డిగ్రీ కళాశాల గడిచిన మూడేళ్లలో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. పలు కోర్సులతోపాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వంటివి అందుబాటులో ఉన్నాయన్నారు. డిజిటల్ కంప్యూటర్ తరగతులు, డిజిటల్ లైబ్రరీ ఉన్నాయని వివరించారు. ప్రధానంగా నిపుణులైన అధ్యాపకులు ఉన్నారని, విశాలమైన తరగతి గదులు ఉన్నాయన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆదరించాలని కోరారు.

చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం


మాట్లాడుతున్న ఎస్ఐ సంధ్యారాణి

నరసన్నపేట: చెడు వ్యసనాలతో జీవితాలు నాశనమవుతాయని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో నరసన్నపేట ఎస్ఐ జె.సంధ్యారాణి సూచించారు. స్థానిక ఎల్‌వీఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బుధవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి, కొకైన్ వంటి డ్రగ్స్ చాలా ప్రమాదకరమని అన్నారు. కొందరు యువకులు గంజాయి వినియోగిస్తున్నట్లు సమాచారం ఉందని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సూచనల మేరకు ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాదరావు పాల్గొన్నారు.

లావేటిపేటలో పారిశుద్ధ్య పనులు

ఎచ్చెర్ల: లావేటిపేట, రామజోగిపేట గ్రామాల్లో బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీధుల్లో చెత్తాచెదారాలను తొలగించి శుభ్రం చేశారు. వాటర్ ట్యాంక్‌ల వద్ద క్లోరినేషన్ చేశారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి అభిషేకాలు


పూజలందుకుంటున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం స్వామికి క్షీరాభిషేకాలు జరిగాయి. అర్చకులు దేవరకొండ శంకరనారాయణ శర్మ నేతృత్వంలో పంచామృతాభిషేకాలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకొని పూజలు చేశారు.

ఆరోగ్యంపై అవగాహన


గ్రామస్తులతో యోగా చేయిస్తున్న దృశ్యం

లావేరు: ఆరోగ్యం పట్ల ప్రతిఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని పెదలింగాలవలస వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఎంఎల్‌హెచ్‌పీ స్వర్ణలత అన్నారు. చినలింగాలవలస గ్రామంలో హెల్త్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గ్రామస్తులతో యోగా చేయించడంతోపాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. రోజూ యోగా, వ్యాయామం చేయడం ద్వారా మెరుగైన ఆరోగ్యం సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నరసన్నపేట: స్థానిక పల్లిపేట కూడలిలో ఉన్న ఉమానీలకంఠేశ్వర స్వామి కల్యాణం బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు వసనాబి మల్లికార్జున స్వామి, కుమార్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

18 నుంచి ఆలయ వార్షికోత్సవం

సారవకోట: మండల కేంద్రంలోని మండలాదీశ్వర స్వామి ఆలయ 60వ వార్షికోత్సవ మహోత్సవాలు ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏటా మహాశివ రాత్రి నుంచి మూడు రోజులపాటు ఈ ఆలయంలో ఉత్సవాలు నిర్వహిస్తారు.

ప్రతిభకు గుర్తింపు

శ్రీకాకుళం క్రైమ్: విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులకు గుర్తింపు లభించింది. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక పలువురు పోలీసు అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కేసుల దర్యాప్తు, చార్జిషీటు దాఖలు, వాటి పరిష్కారం, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు వంటి అంశాలలో కృషి చేసిన శ్రీకాకుళం రెండో పట్టణ, కాశీబుగ్గ సీఐలు పి.శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, ఎస్ఐలు గణేష్, విజయ్‌కుమార్, మధుసూదనరావు, కృష్ణారావు, రాజేష్‌లకు ఈ ప్రశంసాపత్రాలు దక్కాయి.


గార ఎస్ఐ మధుసూదనరావు


శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్


శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్ఐ గణేష్


ఎస్పీ రాధిక చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న శ్రీకాకుళం రెండో పట్టణ సీఐ పప్పల శ్రీనివాసరావు

చదువుపై దృష్టిసారించాలి


బోధనలో మెలకువలు వివరిస్తున్న ఈశ్వరరావు

రణస్థలం: విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టిసారించాలని రాష్ట్ర విద్యాశాఖ బోధన పరిశీలకులు పి.ఈశ్వరరావు అన్నారు. కోష్ట జెడ్పీ హైస్కూల్‌ను బుధవారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సృజనాత్మక బోధనతో విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతం పెరుగుతోందన్నారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. బోధనలో మెలకువలు వివరించారు. పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలను ప్రభుత్వం సమకూర్చుతోందన్నారు. కార్యక్రమంలో డైట్ లెక్చరర్ సూర్యప్రకాశ్, హెచ్ఎం జగన్నాథం, సీఆర్‌పీ పాపినాయుడు ఉన్నారు.

ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి


సినీగీతాలు ఆలపించిన గాయకులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బాపూజీ కళామందిర్‌లో శ్రీకాకుళం సంగీత, నృత్య ఆకాడమీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి, వాద్య సంగీత విభావరి ఆహూతులను ఆకట్టుకుంది. కళాతపస్వి కె.విశ్వనాథ్, పద్మభూషణ్ వాణీజయరామ్‌లకు నివాళిగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వారి చిత్రాల్లోని గీతాలను గాయకులు చక్కగా ఆలపించారు. జడ్జి జస్టిస్ కె.శ్రీదేవి దీపారాధన చేసి కార్యక్రమం ప్రారంభించగా.. అకాడమీ అధ్యక్షులు జె.వెంకటేశ్వరరావు, కార్యదర్శి మావుడూరి సత్యనారాయణశర్మ, బండారు చిట్టిబాబు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, అకాడమీ సభ్యులు మండా శ్రీనివాసరావు, పి.మాలతి, మార్గదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ


పరామర్శలో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ తదితరులు

లావేరు: సూర్యనారాయణపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నడుపూరి రాంబాబు చిన్నాన్న మహలక్ష్మునాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలియడంతో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం ఆ గ్రామానికి వెళ్లి రాంబాబును, మృతుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట తామాడ మాజీ సర్పంచ్ పాలిశెట్టి మధుబాబు, పార్టీ నాయకులు పాలిశెట్టి మల్లిబాబు, నడుపూరి సత్యం, మహంతి సూర్యనారాయణ, నడుపూరి కృష్ణ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ

జి.సిగడాం: ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలి అప్పలసూరి చిన్నాన్న సూరప్పడు నడిమివలసలో ఇటీవల చనిపోయారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, మండల బూత్ కన్వీనర్ అబోతుల జగన్నాథం తదితరులు బుధవారం నడిమివలస వెళ్లి అప్పలసూరి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. స్థానిక సర్పంచ్ బాలి రమేష్, నాయకులు బాలి లక్ష్మణరావు, కింజరాపు జగన్ ఉన్నారు.

నారాయణప్పడు సేవలు శ్లాఘనీయం


నారాయణప్పడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ చంద్రశేఖర్ తదితరులు

జి.సిగడాం: బాతువ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, సహకార సంఘం మాజీ చైర్మన్ ముల్లు నారాయణప్పడు మృతి పార్టీకి తీరని లోటని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. బాతువ గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన నారాయణప్పడు సంతాప సభలో ఎంపీ పాల్గొన్నారు. నాలుగుసార్లు సర్పంచ్‌గా, మూడుసార్లు సహకార సంఘం చైర్మన్‌గా పని చేసిన నారాయణప్పడు గ్రామాభివృద్ధి పాటుపడ్డారని కొనియాడారు. రైల్వేబోర్డు డైరెక్టర్ తాడేల ఉమామహేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు బూటు అప్పారావు, పీఏసీఎస్ చైర్మన్ పల్లేటి సన్యాసిరావు, కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

73 గ్రామాల్లో రెండో విడత భూ సర్వే


సారవకోటలో భూ రీ సర్వేను పరిశీలిస్తునన సర్వే ఇన్‌స్పెక్టర్

- రీ సర్వే వేగవంతానికి కృషి
- సర్వే ఇన్‌స్పెక్టర్ కె.రమేష్

సారవకోట: టెక్కలి డివిజన్ పరిధిలో 73 రెవెన్యూ గ్రామాల్లో రెండో విడత భూ సర్వే చేపడుతున్నట్లు సర్వే ఇన్‌స్పెక్టర్ కె.రమేష్ తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని సారవకోట, ధర్మలక్ష్మీపురం సచివాలయాల పరిధిలో జరుగుతున్న రెండో విడత భూ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెక్కలి డివిజన్ పరిధిలో రెండో విడత భూ సర్వేలో 56 గ్రామాల్లో ఇప్పటికే గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తయిందన్నారు. అలాగే మొదటి విడతలో భూ సర్వే పూర్తయిన చోట్ల సర్వే రాళ్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని, వీలైనంత త్వరగా సర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే పలు గ్రామాల్లో ఈ-పాస్ పుస్తకాల పంపిణీ చేశామన్నారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న భూ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. సర్వే సిబ్బందికి గ్రామాల్లోని రైతులు సహకరించాలన్నారు. సర్వే వేగవంతం చేయాలని సిబ్బందికి ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సర్వే చేపట్టాలని సూచించారు. మండల సర్వేయర్ మహేశ్, వీఆర్వో గౌరమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలి


ఆలయ వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: ప్రజలు ఆధ్యాత్మిక భావాలు మరింత పెంపొందించుకోవాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని మోదుగువలస (చిన్నకొల్లివలస) పునరావాస కాలనీలో బుధవారం జరిగిన ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. శివపార్వతుల కల్యాణం, కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్తులందరూ ఐకమత్యంగా నిర్వహించుకునే పూజలు, ఆలయ వర్షికోత్సవాలు, ఆలయాల నిర్మాణాలు అందరినీ ఏకతాటిపై నడిపిస్తాయన్నారు. ఎంపీపీ రెడ్డి జ్యోతి లక్ష్మి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు, చిన్నకొల్లివలస సర్పంచ్ రెడ్డి రామారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల రాము, సర్పంచ్‌లు గాది కోటేశ్వరరవు, యారబాటి గణపతి, వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డి లక్ష్మణరావు, కొల్ల రాము, ముద్దాడ లక్ష్మణరావు, బలగ గోవిందరావు, లోచర్ల మల్లేశ్వరరావు, ఎర్ర జనార్దన తదితరులు పాల్గొన్నారు.